సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.869 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 72.869 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 4484 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,240
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,157
3 శాతం జీఎస్టీతో	రూ.7,372
సవర (8 గ్రా)	రూ.58,976

గరిష్టం/కనిష్టం
29.2 /22.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఒకటి రెండు చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 95 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రైళ్ల రాకపోకలపై పొగమంచు ఎఫెక్ట్



నెల్లూరు(సెంట్రల్): దట్టమైన పొగమంచు వల్ల రైళ్ల రాకపోకలకు తీవ్ర జాప్యం కలుగుతోంది. ప్రధానంగా సికింద్రాబాద్ – గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ మంచు కారణంగా దాదాపుగా 3 నుంచి 5 గంటల వరకు ఆలస్యంగా నడుస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి సికింద్రాబాద్‌లో బయలుదేరిన ఈ రైలు సోమవారం ఉదయం 8 గంటలకు నెల్లూరుకు చేరాల్సి ఉండగా దాదాపుగా 5 గంటల ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చింది. ఇదే విధంగా పలు రైళ్లు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయని, మంచు కారణంగానే ఇలా జరుగుతోందని రైల్వే అధికారులు తెలిపారు.

24న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 24న జెడ్పీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు సంబంధించి జెడ్పీ సభ్యులు ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీల్లో వేగంగా వసతులు కల్పించండి

నెల్లూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్ నుంచి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో కోర్టు కేసుల పరిష్కారంపై కిందిస్థాయి సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కేసు పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో న్యాయస్థానాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం తగదని సూచించారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సీసీ రోడ్లను వెంటనే గ్రౌండింగ్ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ కార్తిక్, డీఆర్‌ఓ ఉదయభాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వర్ష సూచన



నెల్లూరు(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోస్తా, సీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. మోస్తరు నుంచి ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపింది.

జూడో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన బాలబాలికలు

కావలి: నెల్లూరు జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో జిల్లా జట్టు బాలబాలికల క్రీడాకారుల ఎంపికలు కొత్తసత్రం జెడ్పీ హైస్కూల్లో సోమవారం జరిగాయి. ఈ సెలెక్షన్స్‌లో 80 మందిపైగా బాలబాలికలు పాల్గొనగా వారిలో కొందరిని సెలెక్ట్ చేశారు. వారు ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే జూడో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. సెలెక్ట్ అయిన విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకొని రాష్ట్ర పోటీలకు హాజరుకావాలని జూడో సంఘం తెలిపింది. ఎంపికల కార్యక్రమంలో జిల్లా జూడో అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు మురళి, కొత్తసత్రం జెడ్పీ హైస్కూలు హెడ్మాస్టర్ శ్రీనివాసరావు, జిల్లా జూడో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి మాయరోగం

రోగులకు అందని సేవలు

- ఎఫ్‌ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓల కొరత
- సెంట్రల్ ల్యాబ్ వద్ద పనిచేయని లిఫ్ట్
- మెట్లు ఎక్కలేక రక్తపరీక్షలు చేయించుకోలేని వృద్ధులు
- వీల్‌చైర్‌లు, విశ్రాంత కుర్చీల కొరత
- ఒక్కటి కూడా లేని ఫిజియోథెరపీ యంత్రాలు

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)కి భవనాలు, అధునాతన ఆపరేషన్ థియేటర్లు, స్పెషలిస్టు డాక్టర్లున్నా పేద రోగులకు సరిగా వైద్యం అందడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆసుపత్రిలో సమస్యలు ఎక్కువయ్యాయి. జిల్లాలో ఇద్దరు మంత్రులున్నప్పటికీ ఈ విషయం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

– నెల్లూరు(అర్బన్)



➡ ఈ చిత్రంలో వీల్‌చైర్‌లో కూర్చున్న మహిళ పేరు జయమ్మ. ముత్తుకూరు గ్రామం. అనారోగ్యంతో పెద్దాస్పత్రికి వైద్యం కోసం వచ్చింది. ఆమెకు డాక్టర్లు స్కానింగ్ రాశారు. ఓపీ భవనం నుంచి 600 అడుగుల దూరంలో స్కానింగ్ రూము ఉంది. అక్కడకు వెళ్లేందుకు ఆమె నడవలేని పరిస్థితి. కుటుంబ సభ్యులు 30 నిమిషాలకు పైగా వెతికితేగానీ వీల్‌చైర్ కనిపించలేదు. నర్సును బతిమిలాడి వీల్‌చైర్‌ను తీసుకున్నారు. పట్టేందుకు ఎంఎన్‌ఓగానీ, ఎఫ్‌ఎన్‌ఓ గానీ లేరు. ఇక చేసేదేమీ లేక జయమ్మ కుటుంబ సభ్యులే ఆ చైర్‌ను నెట్టుకుంటూ తీసుకెళ్లారు.



➡ ఈ వ్యక్తి పేరు షాబ్ జాన్. 80 ఏళ్లు పైనే ఉన్నాయి. బాలాజీనగర్‌లోని గుర్రాల మడుగు సంఘంలో నివాసం ఉంటున్నాడు. భార్య నడవలేని పరిస్థితి. నిరుపేద. ఈ స్థితిలో ఆయన నెమ్ముతో అతి కష్టంమీద పెద్దాస్పత్రికి వచ్చాడు. డాక్టర్ ఎక్స్‌రే తీయించుకుని రా అని చీటి రాసిచ్చాడు. పలువురిని అడుగుతూ దూరంగా ఉన్న ఎక్స్‌రే రూం వద్దకు వచ్చాడు. అర్ధగంట తర్వాత ఎక్స్‌రే తీశారు. అక్కడ ఫిల్మ్‌లు ఉండవు. పెద్ద(ఆండ్రాయిడ్) ఫోన్‌లో ఎక్స్‌రేను ఫొటో తీసుకుని డాక్టర్ వద్దకు వెళ్లి చూపించుకోవాలి. షాబ్‌జాన్‌కు పెద్ద ఫోన్ లేదు. దీంతో ఎక్స్‌రే తీయించుకుని కూడా పని కాకుండా పోయింది. ఉసూరుమంటూ వెనక్కు వెళ్లిపోయాడు. జబ్బు గురించి తెలుసుకోకుండానే మందులు రాయించుకుని ఇంటికి బాధతో వెళ్లాడు.

ఇవి ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి సంఘటనలు పెద్దాస్పత్రిలో అనేకం ఉన్నాయి.

వందల్లో పడకలు

750 పడకలతో పెద్దాస్పత్రి ఉంది. ప్రతి రోజు సరాసరి అవుట్ పేషెంట్లు 1300 మంది వరకు వస్తారు. ఇన్‌పేషెంట్లు సుమారు 550 మంది అడ్మిషన్లలో ఉంటున్నారు. వారికి సక్రమంగా వైద్యసేవలందించడంలో అధికారులు విఫలమవుతున్నారు.



పెద్దాస్పత్రిలో ఓపీ కార్డు కోసం క్యూలో ఉన్న స్త్రీలు, పురుషులు

ఫిజియోథెరపీ మెషీన్లు లేవు

ఆస్పత్రిలో పక్షవాతం ఉన్నవారికి, షుగర్ వల్ల భుజం కీలు స్టక్ అయిపోయిన వారికి, మెడ, నడుము పట్టేసిన వారికి, వెన్నుముక సమస్యలున్న వారికి, మోకాలు నొప్పులు అధికంగా ఉన్న వారికి ఫిజియోథెరపీ సేవలు ఎంతో అవసరం. అయితే పెద్దాస్పత్రిలో ఫిజియోథెరపీ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. ఫిజియోథెరపీ డాక్టర్లతో పాటు నలుగురు టెక్నీషియన్లున్నారు. రోగుల బాధలు చూడలేక టెక్నీషియన్లే తమ జీతంలో నుంచి తలా కొంత వేసుకుని రూ.12,500తో ఒక యంత్రాన్ని కొనుగోలు చేశారు. టెక్నీషియన్లు ఫిజియోథెరపీ యంత్రాలు కావాలని పలుసార్లు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లెటర్లు పెట్టారు. అయినా యంత్రాలు లేవు. కేవలం రూ.లక్ష మాత్రమే ఖర్చు పెడితే అన్ని రకాల యంత్రాలు అందుబాటులోకి వస్తాయి. అయినా పట్టించుకోలేదు.

కట్లు కట్టించుకుంటే కొత్త జబ్బులు

రోగులకు పుండ్లు, గాయాలు, దెబ్బలు తగిలినప్పుడు, సర్జరీలు చేసినప్పుడు కట్టు కట్టే రూంకి వెళ్లి క్లీనింగ్ చేయించుకుని కట్టు వేయించుకోవాలి. అయితే అక్కడ ఉన్న తెర నల్లగా మరకలతో మాసిపోయి ఉంది. దానిని చూస్తేనే వాంతి వచ్చేలా ఉంది. దానిని ఉతికిన పాపాన పోలేదని రోగులు ఆవేదన చెందుతున్నారు. కట్లు కట్టే చోట అత్యంత పరిశుభ్రత అవసరం. ఒక వ్యక్తి అసిస్టెంట్‌ను తీసుకుని పక్కన ఎక్కడా తగలకుండా కట్టుకట్టాలి. అసిస్టెంట్ మందులు వేస్తూంటే మరొక వ్యక్తి పక్కనే బల్లగాని, గోడగాని తగలకుండా కంటామినేట్ కాకుండా కట్టుకట్టాలి. కాని పెద్దాస్పత్రిలో అలా జరగడం లేదు. ఒకే వ్యక్తి మందు డబ్బాను, ఆయింట్‌మెంట్ డబ్బాను పట్టుకుంటాడు. అదే చేత్తో కట్టుకడతాడు. ఆ డబ్బాకు ఉండే దుమ్ము, ధూళితో కూడిన నలుసులు రోగికి అంటుకుని కొత్త జబ్బు వచ్చే ప్రమాదం ఉంది.



ఎక్స్‌రే వద్ద కుర్చీలు లేక నిలబడిపోయిన రోగులు

పదిరోజుల క్రితం డాక్టర్ చైర్ కింద పాము

ఆస్పత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వాటిని ఎప్పటికప్పుడు క్లీన్ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ పని సక్రమంగా జరగడం లేదు. దీంతో ఆ గుబుర్లలో పాములు తిరుగుతున్నాయి. గతంలో వెంకటేశ్వరపురానికి చెందిన ఓ పారిశుధ్య కార్మికురాలు పాము కరవడంతో మృతి చెందింది. అలాగే మరో కార్మికురాలికి సైతం పాము కాటు వేసింది. అయితే ఆమె ప్రమాదం నుంచి బయటపడింది. తాజాగా 10 రోజుల క్రితం ఆర్థోపెడిక్ విభాగంలో ఓ డాక్టర్ చైర్ కిందకు రక్తపింజర పాము వచ్చింది. పొద్దున్నే క్లీన్ చేసేందుకు వచ్చిన పారిశుధ్య కార్మికులు దానిని చంపేశారు. ఇలా జరగడానికి భవనాల చుట్టుతా పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడమే కారణం.

ఎఫ్‌ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓలు కొరత

పెద్దాస్పత్రిలో అటెండర్లు, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ సిబ్బంది కనీసం మూడు షిఫ్ట్‌లకు 250 మంది అవసరం. అయితే కేవలం 18 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పనులు జరగడం లేదు. పలువురు అవుట్ సోర్సింగ్ శానిటరీ వర్కర్లను ఎఫ్‌ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓలుగా డైవర్ట్ చేసి పనులు చేయిస్తున్నారు. సిబ్బంది కొరతను తీర్చడానికి రాష్ట్ర ఉన్నతాధికారులతో అధికారులు మాట్లాడక పోవడం వల్లనే ఇలా ఇబ్బందులు జరుగుతున్నాయి. ఇకనైనా సమస్యలు పరిష్కరించి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని రోగులు కోరుతున్నారు.

మందులు అంతంత మాత్రమే



- పెద్దాస్పత్రిలో కొన్ని రకాల మందులు అందుబాటులో ఉండటం లేదు. ఉదాహరణకు సాధారణంగా పెర్‌మిత్రిన్ అనే ఆయింట్‌మెంట్ గానీ, లోషన్ గానీ లేదు. దీంతో తామర, స్కేబిస్ ఉన్నవారు ఆ మందు బయట కొనాల్సిందే.
- డయాబెటిస్‌కు వాడే టెనిలిగ్లిప్టిన్ అనే టాబ్లెట్లు లేవు.
- జెన్సన్ వయిలెట్ పెయింట్ లేదు.
- మల్టీవిటమిన్ ట్యాబ్లెట్లు డాక్టర్లు రాస్తే వాటికి బదులు బీకాంప్లెక్స్ మాత్రలు మాత్రమే ఇస్తున్నారు.
- బీ12 ఇంజక్షన్ అందుబాటులో లేదు.
- కంటికి సంబంధించిన కొన్ని రకాల చుక్కల మందులను ఆస్పత్రిలో లేకపోవడంతో బయట కొనుక్కోమని చీటి రాసిస్తున్నారు.
- క్లారిత్రోమైసిన్ అనే యాంటిబయాటిక్ మందులు లేవు. దీంతో కొన్ని మందులు ఆస్పత్రిలో తీసుకుని మరికొన్ని మందులు బయట కొనుగోలు చేస్తున్నందువల్ల నిరుపేద రోగుల జేబులకు చిల్లుపడుతోంది.

పై అంతస్తులో రక్తపరీక్షలు... పనిచేయని లిఫ్ట్



లిఫ్ట్ పని చేయకపోవడంతో రోగిని వీల్‌చైర్‌లో నెట్టుకుంటూ వచ్చి నిలబడిపోయిన మహిళ

రక్తపరీక్షలు చేయించుకోవాలంటే రోగులు ల్యాబ్‌లోని పైఅంతస్తులోకి మెట్లు ఎక్కి వెళ్లాలి. 70 లేదా 80 ఏళ్ల ముసలి వారు ఎక్కాలంటే నరకం కనిపిస్తోంది. ఇక దివ్యాంగులు అసలు ఎక్కలేని పరిస్థితి. లిఫ్ట్ ఒక్క రోజు పని చేస్తే వంద రోజులు పని చేయదు. దీంతో పైకి మెట్లు ఎక్కలేని వృద్ధులు పలువురు రక్తపరీక్షలు చేయించుకోకుండానే మందులు రాయించుకుని వెళ్లిపోతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

ఆస్పత్రిలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ఇప్పుడు మందుల కొరతలేదు. ల్యాబ్ వద్ద లిఫ్ట్‌ను తక్షణమే మరమ్మతులు చేయిస్తాను. ఫిజియోథెరపీ యంత్రాలు కొనుగోలు చేసేందుకు కొటేషన్లు సిద్ధం చేశాం. వీల్‌చైర్‌ల కొరత లేకుండా చేస్తాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, పెద్దాస్పత్రి

హెచ్‌డీఎస్‌లో చర్చిస్తాం

ఆస్పత్రిలో బుధవారం హెచ్‌డీఎస్ సమావేశం జరుగబోతుంది. అందులో ఆస్పత్రిలోని సమస్యలను చర్చించి వాటిని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– మదపర్తి శ్రీనివాసులు, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్

రెండో రోజూ రైతుల ఆందోళన

- వరినార్లు ఎండుతున్నాయి
- నీటిని విడుదల చేసి ఆదుకోండి
- రాళ్లపాడు నీటిని విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలోని కుడి కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలంటూ రైతాంగం సోమవారం కూడా ఆయకట్టు రైతులు ఆందోళనకు దిగారు. గత పది రోజులుగా కుడి కాలువ గేటు పైకి లేపేందుకు అధికారులు ఉత్తుత్తి ప్రయత్నాలు చేశారని, చైన్‌బ్లాకులతోనే సరిపెట్టి నీటి విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. రోజులు గడుస్తుండడంతో పోసిన వరినార్లు ఎండిపోతున్నాయని, మమ్మల్ని ఆదుకునే నాథుడు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయాలి

ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు చేరిందని, కుడి కాలువకు పూర్తిగా నీరు విడుదల చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రాజెక్టు వద్దే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు హెచ్చరించారు. ప్రాజెక్టులో చేపలు వేసి కాలువకు నీరు విడుదల కాకుండా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. వరి నారుమడులు, నాటిన నాట్లు ఎండిపోతున్నాయని, నష్టపరిహారం ఎవరు ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఓ రైతు ప్రాజెక్టులో దూకేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అతన్ని వారించి అక్కడ నుంచి పంపించివేశారు.

తూమును పగులగొట్టి నీరు వచ్చేలా ఏర్పాట్లు

కుడి కాలువ తూముకు ఉన్న గేటు ఊడిపోవడంతో అది పైకి లేపేందుకు అధికారులు తర్జన భర్జనపడి విఫలం కావడంతో సోమవారం కంప్రెషర్ ద్వారా తూమును పగులగొట్టారు. తూమును 70 ఏళ్ల క్రితం రాళ్లతో కట్టడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగడుగులు మేర రాళ్లను తొలగించి కాలువకు కొంతమేర నీరు వచ్చేలా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ వరలక్ష్మి మాట్లాడుతూ కుడి కాలువకు 100 క్యూసెక్కుల నీరు విడుదల అయ్యేలా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఎన్ని రోజులు ఇలా చేస్తారని, ప్రాజెక్టులో నీరు తగ్గేకొద్ది తూమును పగులగొట్టే అవకాశం లేదని, మాకు ప్రత్యామ్నాయంగా మోటార్లతో కాలువకు పంపింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో సీఈ శ్యాంప్రసాద్ కుడి కాలువ తూము వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడి కాలువకు కొంత నీరు వెళుతుందని తాము గేటును పైకి తీసేందుకు ప్రయత్నాలు చేశామని, అది వీలుకాకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడ వద్ద బోట్లను తొలగించిన వారితో కూడా మాట్లాడామని రెండు రోజుల్లో వారు కూడా వచ్చి గేటు తీసేందుకు ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.



రాళ్లపాడు కుడి కాలువ వద్ద ధర్నా చేస్తున్న రైతులు



డ్రిల్లింగ్ మెషీన్‌తో కుడి కాలువ తూమును పగులగొడుతున్న సిబ్బంది

రైతులకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే శివరాం

కుడి కాలువకు పది రోజులుగా నీటిని విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రాళ్లపాడు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనలో పాల్గొని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వహణ పట్ల ముందు జాగ్రత్త, దూరదృష్టి లేకపోవడంతో నేడు రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలోని 25 వేల ఎకరాల్లో సాగుకు నోచుకోక అన్నదాతలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాలుగు రోజుల క్రితం గేటు పైకి లేచిందని తెలియడంతో సంతోషపడ్డానని, కానీ కొంచెం నీరు మాత్రమే కాలువకు వెళుతుండడంతో మొదటి గ్రామాలకే సరిపోతుందని, చివరి భూముల వరకు నీరు వెళ్లాలంటే కాలువకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలన్నారు.

ఎస్‌ఏ టర్మ్–1 మ్యాథ్స్ పరీక్ష రద్దు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్–1 పరీక్షలు ఈనెల 11వ తేదీనుంచి జరుగుతున్నాయి. ఈ పరీక్షలు ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అయితే సోమవారం జరగాల్సిన మ్యాథ్స్ పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. దీంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మ్యాథ్స్ పరీక్షను వాయిదా వేశారు. మళ్లీ ఈ పరీక్షను ఈనెల 20వతేదీన నిర్వహించనున్నట్లు చెబుతున్నారు.

మామిడి తోటల్లో పూత జాడేదీ?

మామిడి రైతుపై ప్రకృతి పగబడుతోంది. పంటకు ఈసారి వాతావరణం ప్రతికూలంగా మారడంతో యజమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల తుపాను ప్రభావంతో విడతల వారీగా భారీ వర్షాలు కురిసి, తర్వాత ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో భూమిలో తడి, గాలిలో తేమ ఎక్కువగా ఉండడం మామిడి తోటలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది.

– కావలి



ఎదుగుదల లేక గిటకబారిపోతున్న పూత



➡ తోటల్లో ప్రస్తుతం పూత రెమ్మలు తక్కువగా కనిపిస్తున్నాయి. అధిక వర్షాలే దీనికి కారణమని, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గుల వల్ల పలు రకాల తెగుళ్లు సోకే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్కడక్కడ తేనె మంచు పురుగు సోకి పూత రాలిపోతోంది.

➡ నవంబర్, డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలు మామిడి తోటలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికి తోడు పగటి ఉష్ణోగ్రత తగ్గిపోయింది. దీంతో భూమిలో వర్షపు నీటి చల్లదనం, బయట పడిపోయిన ఉష్ణోగ్రతలు మామిడి చెట్లకు శాపంగా మారాయి. దీంతో డిసెంబర్ మొదటి వారం నుంచి కొమ్మలకు కనిపించాల్సిన పూత తక్కువగా ఉంది.

➡ సహజంగా డిసెంబరు రెండో వారం నుంచి పూత కనిపిస్తుంది. జనవరి తొలి వారం నాటికి పూర్తి స్థాయిలో పూత వస్తుంది. జనవరి, ఫిబ్రవరిలో పిందెలు ఏర్పడి తదుపరి కాయలు వస్తాయి. ప్రస్తుత సీజన్‌లో అధిక వర్షాలు పడడం, రాత్రి వేళలో చలితీవ్రత పెరగడంతో ప్రస్తుతం పూత ఆశించిన మేరకు రాలేదు. ఆలస్యంగా వచ్చే మామిడి పూత పిందెగా మారకుండానే రాలిపోయే ప్రమాదం ఉంది.

ఇలా జరగాల్సింది...ఇలా జరిగింది..

➡ నవంబర్ నుంచి మామిడి తోటలలోని చెట్లకు విశ్రాంతి ఇవ్వాలి. ఈ సమయంలో చెట్టుకు అంతరాయం కలిగించినట్లయితే పూత రావడం ఆలస్యమవడం లేదా పూత రాకపోవడం జరుగుతుంది.

➡ మామిడి పూత రావడానికి ముందు రెండు నెలలు బెట్ట పరిస్థితుల్లో మామిడి తోటలు ఉండాలి. కాబట్టి తోటలకు నీటి తడులు ఇవ్వడం పూర్తిగా నిలిపివేయాలి. పూతకు ముందు భూమిలో తడి ఉంటే చెట్లలో పూతకు బదులు ఆకు చిగుర్లు వచ్చేస్తాయి.

ఆందోళన చెందవద్దు

జిల్లాలో మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మామిడి తోటలకు తుప్పు తెగులు, బూజు తెగులు సోకకుండా దాని నివారణకు ఒక లీటరు నీటిలో 1.5 గ్రాముల సాఫ్‌ను కలిపి పిచికారీ చేయాలి.

ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, నెల్లూరు



పూత కనిపించని మామిడి చెట్లు

క్లుప్తంగా

ముగ్గురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 4,574 మంది విద్యార్థులకు 4,213 మంది హాజరుకాగా, 361 మంది గైర్హాజరయ్యారని, వివిధ పరీక్ష కేంద్రాల్లో ముగ్గురు డిబార్ అయ్యారని తెలిపారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ఇంజినీర్లు సోమవారం వెల్లడించారు. 1వ యూనిట్లో 450 మెగా వాట్లు, 2వ యూనిట్లో 500 మెగావాట్లు, 3వ యూనిట్లో 650 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.

వైద్యశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): వైద్య ఆరోగ్యశాఖలో ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలోని డైస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్ 1, డెంటల్ టెక్నీషియన్ 1 పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవి.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు జతపరిచి ఈ నెల 19వ తేదీలోపు నెల్లూరు పెద్దాస్పత్రి ఆవరణలోని డైస్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు అందజేయాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

- సంధ్య ఆక్వా హేచరీలో ఘటన


శ్రీనివాసరావు మృతదేహం

ఉలవపాడు: విద్యుత్ మోటార్ స్విచ్ వేస్తుండగా షాక్‌కు గురై ఆక్వా హేచరీ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కరేడు పంచాయతీ బట్టిసోమయ్యపాళెం వద్ద సంధ్య ఆక్వా హేచరీలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. శ్రీకాకుళానికి చెందిన కొంపల శ్రీనివాసరావు (45) హేచరీలో నీటి సరఫరా కోసం మోటార్ షెడ్డు వద్దకు వెళ్లి స్విచ్ ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. శ్రీనివాసరావు ఎంతకీ రాకపోవడంతో మోటార్ వద్దకు మిగిలిన కూలీలు వెళ్లి చూడగా అతను అపస్మారక స్థితిలో పడిపోయినట్లు గుర్తించారు. వెంటనే ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. ఎస్సై అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


రామకృష్ణ మృతదేహం

నెల్లూరు సిటీ: నెల్లూరు నుంచి కావలి వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్థానిక ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. సర్వేపల్లికి చెందిన ఎన్. రామకృష్ణ (41) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో సొంత పని మీద సర్వేపల్లి నుంచి కావలి వైపు బైక్‌పై వెళ్తుండగా, ఎస్వీజీఎస్ కళాశాలకు సమీపంలోని జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొంది. దీంతో రామకృష్ణకు తీవ్రగాయాలై మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలేరు సై'కతం'

- భూకైలాస్.. ఎకరం రూ.10 లక్షలు
- ఏటి ఒడ్డున ఇసుకపర్ర పొలాల విక్రయం
- తవ్వకాలతో క్వారీల్లా మారుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న పక్క పొలాల రైతులు
- విక్కిరాలపేటలో నదీ తీరం ధ్వంసం

పాలేరు నదీ తీరం భూకైలాస్‌గా మారింది. 'ఇసుక' పచ్చతోడేళ్లకు ఆదాయవనరుగా మారింది. ఇప్పటికే నదిలో అడుగడుగునా కుళ్ల బొడిచేశారు. ఇసుక నిల్వలు అడుగంటడంతో తీరం వెంబడి ఉండే ఇసుకపర్ర భూములకు డిమాండ్ పెరిగింది. అధికార పార్టీ నేతల అండతో కొందరు బడా వ్యక్తులు ఈ భూములను కేవలం ఇసుక తవ్వకాల కోసమే కొనేస్తున్నారు. ఇవన్నీ కూడా ప్రభుత్వ భూములే. తరతరాలుగా కొందరు జామాయిల్, సరుగుడు సాగు చేసుకుంటూ బతుకు జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు అలాంటి భూములు ఎందుకు పనికి రాని విధంగా తవ్వేస్తున్నారు.

కందుకూరు రూరల్: అధికార పార్టీలోని ఇసుక మాఫియా బరి తెగించింది. పాలేరు నదిలో ఇసుకను తవ్వేశారు. ఇప్పుడు నదీ తీరం వెంబడి ఇసుకపర్ర నేలల్లోని ఇసుకను తవ్వేస్తున్నారు. మండలంలోని విక్కిరాలపేట, బలిజపాళెం గ్రామాల మధ్య పాలేరు నది ఉంది. బలిజపాళెం రెవెన్యూ పరిధిలో పాలేరు నది ఒడ్డు, పరీవాహక ప్రాంతాల్లో బలిజపాళెంకు చెందిన కొందరు ఇసుక పొలాలను సాగు చేసుకుంటున్నారు. అయితే ఆ పొలాలకు పట్టాలు లేవు. కానీ పొలాల్లోని ఇసుక నాణ్యమైనది కావడంతో భూకైలాస్‌గా మారింది. ఎకరాలకు ఎకరాలు కొనేస్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన అధికార పార్టీ అండదండలతో ఓ మహిళ ఈ వ్యాపారం సాగిస్తోంది. ఎకరం రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చించి ఇసుక కొనుగోలు చేస్తున్నారు. జేసీబీలు పెట్టి దాదాపు 15 అడుగులు లోతులో తవ్వేసి టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. చాటుమాటుగా ఆ పొలం యజమానులు ట్రాక్టర్‌కు రూ.350 చొప్పున తీసుకుని ఇసుక అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

వ్యవసాయ బోర్లు అడుగంటే ప్రమాదం

భూములు క్వారీల్లా ఏర్పడడంతో పాలేరు ఒడ్డున వేసుకున్న వ్యవసాయ బోర్లలో నీరు అడుగంటే


జేసీబీతో తవ్వకాలతో క్వారీలా ఏర్పడిన నదీ తీరం పక్కన పొలం

ప్రమాదం ఉంది. పక్క పొలాల వారు తవ్వకాలు వద్దని చెప్పినా మా పొలం మా ఇష్టం అన్నట్లుగా అధికార పార్టీ అండదండలతో తవ్వకాలు జరుపుతున్నారు. ఈ పొలాల పక్కనే సరుగుడు, పొగాకు నారుమళ్లు, జామాయిల్ వంటివి సాగు చేస్తున్నారు. వేల రూపాయలు వెచ్చించి బోర్లు వేయించుకుంటే ఇసుక తవ్వకాల వల్ల బోర్లను తొలగించే పరిస్థితి నెలకొందని ఇతర రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

రాజీ కుదిర్చి మరీ..

పాలేరు నది ఒడ్డును ఇసుక తవ్వకాలు జరిపే వ్యవహారంలో వివాదాలు రేగుతున్నాయి. కందుకూరు మండల పరిధిలోని బలిజపాళెం, ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చిర్రికూరపాడుకు చెందిన రజక సామాజిక వర్గం వారు ఇసుక భూముల్లో తమకూ హక్కు ఉందని ఎస్సీలతో వాదనలకు దిగుతున్నారు. దీంతో అధికార పార్టీ నాయకులు ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి అమ్ముకునేలా పంచాయితీలు చేసినట్లు సమాచారం.


15 అడుగులకు పైగా తవ్వి ఇసుకను బయటకు తీసిన దృశ్యం


ఇసుక తవ్వకాల పక్కనే పాలేరు ఒడ్డున ఉన్న వ్యవసాయ బోరు

అధైర్యపడొద్దు.. న్యాయం చేస్తాం

- ఎస్పీ కృష్ణకాంత్
- వివిధ సమస్యలపై 72 ఫిర్యాదులు


బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు సిటీ: ఎవరూ అధైర్య పడొద్దు.. న్యాయం జరిగేలా చూస్తానంటూ ఎస్పీ కృష్ణకాంత్ బాధిత ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 72 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ కృష్ణకాంత్ ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడుతూ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ–1, సీఐలు పాల్గొన్నారు.

కిడ్నీ ఇప్పిస్తామని రూ.50 లక్షలు నగదు తీసుకున్నారు

నగరంలోని నవాబుపేటకు చెందిన ఓ వ్యక్తి రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో కిడ్నీ మార్చాలని వైద్యులు తెలపడంతో బాలాజీనగర్‌కు చెందిన రఘువర్ధన్ కిడ్నీ ఇప్పిస్తామని రూ.50 లక్షలు తీసుకున్నారు. కిడ్నీ ఇప్పించకుండా, తిరిగి నగదు కూడా ఇవ్వలేదన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితుడు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు.

సాఫ్ట్‌వేర్ జాబ్‌లు ఇప్పిస్తామని మోసం

కడపకు చెందిన బాలసాయి, నగరంలోని మరో స్నేహితుడు సాఫ్ట్‌వేర్ జాబ్ కోసం కొంత కాలంగా ప్రయత్నాలు చేశారు. అయితే తన స్నేహితులకు ఆటోనగర్‌కు చెందిన కృష్ణచైతన్య, ప్రవీణ్ పరిచయం అయ్యారని, తమకు మంచి కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ జాబ్‌లు ఇప్పిస్తామని రూ.40 లక్షలు వసూలు చేశారు. అయితే జాబ్‌లు ఇప్పించకపోగా, తిరిగి డబ్బులు కూడా ఇవ్వలేదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

తన కుమార్తె ఆచూకీ తెలపండి

వెంకటాచలంసత్రంకు చెందిన తన 17 ఏళ్ల కుమార్తె వారం రోజుల నుంచి కనిపించడం లేదని, ఆచూకీ కనుగొని అప్పగించాలని ఓ మహిళ ఎస్పీని కోరారు. ఎస్పీ వెంటనే ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, ఆచూకీ కనుగొనాలని ఆదేశించారు.

కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరిస్తున్నారు

వేదాయపాళెంకు చెందిన తాను తన భర్త చనిపోయిన తర్వాత అదే ప్రాంతానికి చెందిన సులోమాన్‌తో సహజీవనం చేశాను. ఒక బిడ్డకు జన్మనిచ్చానని, అనంతరం మోసం చేయగా, పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాను. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉందని, సులోమాన్, అతని స్నేహితుడు కేసు వెనక్కి తీసుకోవాలని బెదిరిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

కాపురానికి తీసుకెళ్లకుండా వేధింపులు

తనను 7 నెలల నుంచి కాపురానికి తీసుకెళ్లకుండా తన భర్త, అత్తమామలు వేధిస్తున్నారని కోవూరుకు చెందిన బాధితురాలు ఫిర్యాదు చేశారు. పెళ్లయిన నాటి నుంచి మానసికంగా ఇబ్బంది పెడుతూ వచ్చారు. 7 నెలల నుంచి కాపురానికి తీసుకెళ్లకుండా ఇబ్బందులు పెడుతున్నారని, కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.

సైదాపురం ఎంపీడీఓకు గాయాలు

గూడూరురూరల్: బైక్ అదుపు తప్పి పడిన ప్రమాదంలో సైదాపురం ఎంపీడీఓ శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండలంలోని తిప్పవరప్పాడు సమీపంలో జరిగింది. గూడూరులో నివాసం ఉంటున్న ఆయన సైదాపురంలో విధులకు హాజరయ్యేందుకు సోమవారం బైక్‌పై బయల్దేరారు. తిప్పవరప్పాడు సమీపంలో బైక్ అదుపు బోల్తా పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

జలశక్తి అభయాన్ ఈడీ జిల్లా పర్యటన

నెల్లూరు (పొగతోట): జలశక్తి అభయాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సచీంద్రకుమార్ పట్నాయక్ మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో గతంలో జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. మూడు నెలల క్రితం జిల్లాలో పర్యటించి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. ప్రస్తుతం ఆ పనులు ఏ మేరకు ఫలితాలనిచ్చాయో పరిశీలించనున్నారు. పనుల ప్రగతిపై అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు.

ఆదుకోండి.. కాపాడండి మహాప్రభో..

- నిరసనలు, ఆందోళనలతో కలెక్టరేట్‌లో టెన్షన్


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

నెల్లూరు రూరల్: మా సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. వేధిస్తున్నారని, ఆదుకోవాలని, భూఆక్రమణలు జరగకుండా కాపాడండి అంటూ పలువురు కలెక్టర్ ఆనంద్‌కు వినతులు అందజేశారు. వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యమ సంఘాల నేతలతో పాటు పలువురి ఆందోళనలు, నిరసనలతో కలెక్టరేట్ ప్రాంతంలో సోమవారం టెన్షన్ వాతావరణం నెలకొంది. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి ప్రజల తమ విన్నపాలను అధికారులకు విన్నవించుకున్నారు.

అధికార పార్టీ నేతల భూఆక్రమణపై ఆందోళన

తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం రెవెన్యూ గ్రామంలో ఉన్న సర్వే నంబరు 497, 498లో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని అధికార పార్టీ నాయకుల ఆక్రమణల నుంచి కాపాడి ఆ భూమిని చుట్టూ ఉన్న నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, జిల్లా కార్యదర్శి పుల్లయ్య తదితరులు డిమాండ్ చేశారు. తొలుత కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఓ నాయకుడు తప్పుడు రికార్డులు సృష్టించి ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశారని, నిరుపేదలు ఆ ప్రయత్నాన్ని ఎదురించి అతడి ఆక్రమణ నించి ఆ భూమిని కాపాడుకుని, ఆ భూమిలో ఇంటి స్థలం లేని 450 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. ఇప్పుడు ఆ భూమిని మళ్లీ ఆ నాయకుడు తనదంటూ వస్తున్నారని, పోలీసు, రెవెన్యూ అధికారుల సాయంతో జేసీబీలతో గుడిసెలను బలవంతంగా కూల్చారన్నారు. వాస్తవంగా ఆ భూమి 100 ఏళ్లుగా ఆ ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఇనాం మిగులు భూమిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టా పెద్దబ్బయ్య, ఎంవీరావు, ఈ లక్ష్మణ, కొండయ్య తదితరులు ఉన్నారు.

టీచర్ వేధిస్తున్నాడు..

కలువాయి మండలం ఉయ్యాలపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ తమ్మిశెట్టి రమేష్ వేధిస్తున్నాడని కొల్లూరు పంచాయతీ రాజుపాళెం నివాసి వెంకటస్వామి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తన కుమారుడికి రూ.50 వేలు అప్పుగా రమేష్ ఇచ్చాడన్నారు. అధిక వడ్డీ ఇవ్వాలని ఇంటి దగ్గరకు వచ్చి గొడవ చేస్తున్నాడని, నాకు రూ.4 వేలు పింఛన్ వస్తుందని దాన్ని వడ్డీ కింద తీసుకెళ్తున్నాడని వివరించారు. నా కుమారుడిని ఫోన్లో బెదిరిస్తున్నాడని వాడికి ఏమైనా అయితే పూర్తి బాధ్యత టీచర్‌దేనని తెలిపారు.

దినసరి కూలీలను రెగ్యులర్ చేయాలి

కావలి మున్సిపాలిటీలో ఆరేళ్లుగా పని చేస్తున్న దాదాపు 50 మంది దినసరి కూలీలను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె పెంచలయ్య అధికారులను కోరారు. వీరు కరోనా సమయంలో కూడా ప్రాణాలు పణంగా పెట్టి పనిచేశారన్నారు. ప్రస్తుతం రెగ్యులర్ కార్మికులుగా కొత్త వారిని తీసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని, గతంలో పనిచేసిన వారినే రెగ్యులర్ కూలీలుగా తీసుకోవాలన్నారు. ఏ మున్సిపాలిటీలో లేని విధంగా 60 ఏళ్ల దాటిన వారిని తొలగిస్తున్నారని, అయితే వారి స్థానంలో వారసులకు అవకాశం కల్పించాలని కోరారు.

భూ ఆక్రమణదారుల నుంచి కాపాడండి

మేము ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని కొందరు భూ ఆక్రమణదారులు బలవంతంగా మా పొలంలోకి వచ్చి మాపై దాడులు చేస్తున్నారు. ఈ విషయం నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ నెల్లూరురూరల్ మండలం మిట్టపాళెనికి చెందిన దారా శివయ్య కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మిట్టపాళెం సర్వే నంబరు 1026లో 1.65 ఎకరాల భూమిని తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే బిరదవోలు ప్రదీప్ రెడ్డి, శైలజ, మహేష్, శ్రీకాంత్ పొలంలోకి ప్రవేశించి రూ.4 లక్షలు విలువ చేసే పంటను నాశనం చేశారన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


భారత రైతు కూలీ సంఘం ధర్నా

దళిత మహిళలపై దాడి చేసి అవమాన పరిచి దౌర్జన్యం చేసిన మేకల కృష్ణమనాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. సైదాపురం మండలం జోగిపల్లిలో దళితులు సాగు చేస్తున్న అసైన్‌మెంట్ భూములుకు అక్రమంగా ఇచ్చిన సెటిల్‌మెంట్ పట్టాలను రద్దు చేయాలన్నారు. పోలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అంకయ్య, జిల్లా నాయకులు పందిటి వెంకటయ్య, వేణయ్య, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు బాబు మమత, గడ్డం రమణయ్య, యశోదమ్మ, శారదలు పాల్గొన్నారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	రూ.25
సన్నవి	రూ.18
పండ్లు	రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 110
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 226
లేయర్ చికెన్	: 178

బంగారం కోసమే మహిళపై హత్యాయత్నం

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- పరారీలో మరో నిందితుడు
- ఇందులో ఇద్దరు పాత నేరస్తులే

కావలి: ఓ మహిళ మెడలో బంగారు సరుడు దోచుకునే క్రమంలో ఆమెపై హత్యాయత్నంకు పాల్పడ్డ నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ చెప్పారు. కావలిలో తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గుంటూరు నగరంలోని గోరంట్లకు చెందిన నిందితులు షేక్ ఆరీఫ్, షేక్ నాగూర్, లక్ష్మీనరసింహ స్నేహితులు. చెడు వ్యసనాలకు అలవాటు పడి చదువు మానేశారు. డబ్బులు అవసరం కావడంతో చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నారు. గతంలో గొర్రెలు అపహరించిన నేరంపై రేపల్లె పోలీసులు నమోదు చేసిన కేసులో నాగూర్ బాషా, ఆరీఫ్ జైలుకు వెళ్లారు. టైల్స్ పనిచేసే ఆరీఫ్ ఉదయగిరిలో అడవిపేరాంటాలమ్మ గుడి పక్కన ఉన్న కాలనీలోని ఇంటికి పని నిమిత్తం ఐదుగురుతో కలిసి వచ్చాడు. ఆరీఫ్ పని చేసే కాలనీలో జనసంచారం లేని సమయంలో ఒంటరి వృద్ధులను లక్ష్యంగా చేసుకుని వారి వద్ద ఉన్న బంగారు వస్తువులు అపహరించవచ్చని ఆలోచించాడు. ఇదే విషయాన్ని అతను తన ఫ్రెండ్స్ షేక్ నాగూర్ బాషా, లక్ష్మీ నరసింహకు చెప్పాడు. ఈ నెల 13న గుంటూరు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటల సమయంలో అడవి పేరాంటాలమ్మ గుడి దగ్గరకు చేరుకున్నారు. అక్కడకు సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్ దగ్గర ఉదయగిరి మండలం గడ్డవారిపల్లికి చెందిన కోదారి పద్మావతి వెళ్తుండగా ఆమె మెడలోని బంగారు చైన్‌ను ముగ్గురు లాక్కోవడానికి ప్రయత్నించారు. ఆమె పెనుగులాడుతుండగా ఆరీఫ్ ఆమె చేతులు వెనక్కి పట్టుకోగా, మిగతా ఇద్దరు గొంతు పట్టుకొని చంపడానికి ప్రయత్నించారు. చివరకు చైన్ లాక్కొని బైక్‌పై పారిపోతుండగా గ్రామస్తులు కారు, బైక్‌లపై వెంబడించారు. వెలిగొండ కాలువ వద్ద మట్టి దారిలో తప్పించుకున్నారు. ఈ ఘటనపై నమోదైన కేసును కావలి డీఎస్పీ పి శ్రీధర్, ఉదయగిరి సీఐ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. సోమవారం నిందితులు దుత్తలూరు మండలం సోమలరేగడలో ఉన్నట్లు గుర్తించారు. నిందితులు షేక్ ఆరీఫ్, షేక్ నాగూర్‌ను ఉదయగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ కాలనీలోని కాలువ గట్టు కింద నిందితులు నేరానికి ఉపయోగించిన బైక్, దోపిడీ చేసిన బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు లక్ష్మీ నరసింహ పరారీలో ఉండడంతో అతన్ని అరెస్ట్ చేయాల్సి ఉంది. ఈ కేసు దర్యాప్తులో, నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసుల అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్